జీవనోపాధికి ఎన్ఎల్ఎం పథకం

- రైతులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి
- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకానికి ప్రభుత్వ సహకారం
- 50 శాతం సబ్సిడీతో పథకం అమలు
- దరఖాస్తులను ఆహ్వానిస్తున్న పశుసంవర్ధక శాఖ



కొడంగల్, మే 25 : రైతులు, నిరుద్యోగులు, సహకార సంఘాలకు ఉపాధి, ఉత్పత్తే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకాన్ని ప్రవేశపెట్టిందని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా కోళ్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు దాణా, పశు గ్రాసాన్ని 50 శాతం రాయితీపై అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అర్హులైన రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం మాసం ఉత్పత్తి, గుడ్ల ఉత్పత్తిలో ఆత్మనిర్భర్‌గా మన దేశాన్ని తీర్చిదిద్దడంతో పాటు విదేశాలకు మాంసం, గుడ్లు ఎగుమతి చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వివిధ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ పట్టణ, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద గరిష్ఠంగా కోటి రూపాయల యూనిట్ విలువతో 50 శాతం సబ్సిడీపై కోళ్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం చేపట్టుకోవచ్చని తెలిపారు. ఇందుకు పశుసంవర్ధక శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని పేర్కొన్నారు.

సబ్సిడీ ఇలా..

కోళ్ల పెంపకం యూనిట్ విలువ రూ.35 లక్షలు కాగా ప్రభుత్వం సబ్సిడీగా రూ.12.5 లక్షలు అందిస్తుందని.. మిగిలిన 50 శాతం నిధులు బ్యాంకు రుణంగాని, స్వయంగాగాని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకం కోసం 500 గొర్రెలు, మేకలతో పాటు 25 పొట్టేళ్లు, 25 మేకపోతులను అందిస్తుంది. యూనిట్ విలువ రూ.కోటి వరకు ఉండగా 50 శాతం సబ్సిడీ., పందుల పెంపకం యూనిట్ విలువ రూ.35 లక్షలకు 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రాష్ట్ర స్థాయిలో అర్హులను ఎంపిక చేసి మొదటి సబ్సిడీలో 50 శాతం నిధులు అందజేస్తారు. యూనిట్ ప్రారంభించిన రెండేండ్ల తరువాత మిగిలిన సగం సబ్సిడీని బ్యాంకులో జమ చేస్తారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం షెడ్ నిర్మాణం, నీటి వసతి ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకానికి రైతుల స్వయం సహకార సంఘాలు, పరపతి సంఘాలు, నిరుద్యోగ యువత, సొంత భూమిగాని, లీజుపై భూమి తీసుకున్నవారు అర్హులు. గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకంలో తగిన అనుభవం కలిగి ఉండాలి.

దరఖాస్తు విధానం

ఆసక్తి గలవారు స్వయంగా సహాయక సంఘాలు, ఇతర గ్రూపుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు 5 ఎకరాల పొలానికి సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు బ్యాంకు కాన్‌సెంట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే మండల కేంద్రంలోని పశువైద్యశాఖల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ పథకం ప్రారంభించారు. గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చు. వివరాలకు మండల పశువైద్యశాల అధికారులను సంప్రదించండి.

- డా. నోవా. ఏడీ, పశువైద్యశాల, కొడంగల్

దేవునిఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి వసతులపై చర్చిస్తున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

పనులు త్వరగా పూర్తి చేయాలి

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- చేవెళ్ల మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన

చేవెళ్ల రూరల్, మే 25 : ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. శనివారం చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి, గొల్లపల్లి, కౌకుంట్ల ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మొదటి ఫేజ్ కింద 20 పాఠశాలలు ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పన పనులపై ఆరా తీసి, ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోపు పనులన్నీ పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట మండల విద్యాధికారి అక్బర్, ఎంపీడీవో హిమబిందు, డీఈఈ, ఏఈఈ, ఎంఎన్‌వో, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, దేవుని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్, సీఆర్‌పీలు కృష్ణ, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

- పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్

మహారాజ్‌పేట్‌లో హరితహారం నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్

షాబాద్, మే 25 : పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ హెచ్చరించారు. శనివారం శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్ తదితర గ్రామాలను సందర్శించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డ్, హరిత హారం నర్సరీ, వైకుంఠధామం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను కొనసాగించడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. డంపింగ్‌యార్డ్ నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, ప్లాస్టిక్‌ను బ్యాన్ చేసి, పారిశుధ్య నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకయ్య, ఎంపీవో, ఏపీవో, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సుధీర

గడువున్న వ్యాక్సిన్లు వేయాలి

రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సుధీర

కొత్తూరు, మే 25 : గడువు తేదీ చూసిన తర్వాత చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సుధీర అన్నారు. సుధీర, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు శనివారం కొత్తూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ.. ప్రతి బుధ, శనివారాల్లో ఏడాదిలోపు చిన్నారులకు తప్పకుండా వ్యాక్సిన్ వేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలోని వ్యాక్సినేషన్ రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విజయలక్ష్మి, డా.దామోదర్, డా.హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీనివాసులు, చిట్టిబాబు, సూపర్‌వైజర్లు రవికుమార్ అనసూయ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మారేపల్లి, జనగాం, పెద్దేముల్ గ్రామాలను సందర్శించిన వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

జనగాంలో వైకుంఠధామాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి సూచనలిస్తున్న జయసుధ

పెద్దేముల్, మే 25 : గ్రామపంచాయతీల పరిధిలో నిర్మించిన వైకుంఠధామాల్లో దహన సంస్కారాలు చేసేలా గ్రామ, మండల స్థాయి సిబ్బంది అన్ని గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సూచించారు. శనివారం మండల పరిధిలోని మారేపల్లి, జనగాం, పెద్దేముల్ గ్రామపంచాయతీల్లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టి కంపోస్టు షెడ్లు, వన నర్సరీలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రోజూ క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు షెడ్డుకు తరలించి ఎరువులను తయారు చేసుకోవాలని ఆదేశించారు. వైకుంఠధామాలకు తాగునీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎవరైనా మరణిస్తే స్థానికంగా నిర్మించిన నూతన వైకుంఠధామాల్లోనే దహన సంస్కారాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడా ప్రాంగణాల్లో యువత ప్రతి రోజూ క్రీడలు ఆడుకునేలా అన్ని రకాల ఏర్పాట్లను చేయాలన్నారు. నర్సరీల్లో 100% జర్మినేషన్ ఉండాలని, పిచ్చి మొక్కలు మధ్య మధ్యలో లేకుండా చూడాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో పిచ్చి మొక్కలు లేకుండా అందులోని మొక్కలకు ప్రతి రోజూ నీరు పోయాలని, అన్ని గ్రామాల్లో ఉన్న 10 రకాల జీపీ అసెట్స్‌లను ప్రతి రోజూ శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు నర్సింహారెడ్డి, మల్లికార్జున్, చంద్రప్ప, యశ్వంత్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నగర అభిమానులతో ప్రత్యేక అనుబంధం

స్టార్ సింగర్ అర్మాన్ మాలిక్

షెరటాన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ బాలీవుడ్ స్టార్ సింగర్ అర్మాన్ మాలిక్

శేరిలింగంపల్లి, మే 25: ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నప్పటికీ హైదరాబాద్ అభిమానులకు ప్రత్యేకత ఉందని ప్రముఖ పాటల బాలీవుడ్ స్టార్ సింగర్ అర్మాన్ మాలిక్ అన్నారు. శనివారం గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ ''అర్మాన్ లైవ్ మ్యూజిక్ షో'' కార్యక్రమాన్ని పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షెరటాన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగులో తాను పాడిన 'బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా' పాట తన కెరీర్‌లో మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని, ఎక్కడా లేని గుర్తింపును తెచ్చిపెట్టిందన్నారు. 'అలా.. వైకుంఠపురం' సినిమా మరిచిపోలేని సంతృప్తిని మిగిల్చిందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడలతో పాటు వివిధ భాషల్లో తాను చాలా పాటలు పాడినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన తల్లి తెలుగమ్మాయి కావడంతో తెలుగు భాషతో విడదీయరాని బంధం కలిగి ఉన్నట్లు తెలిపారు. కరోనా తర్వాత హైదరాబాద్ నగరంలో నిర్వహించిన తన తొలి మ్యూజిక్ కన్సర్ట్ జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని, హైదరాబాద్ సంగీత ప్రియులు, యువత తనను ఎంతో ఆదరించారన్నారు. అందుకే, హైదరాబాద్ తన కలిసివచ్చిన అదృష్ట నగరమన్నారు. 'బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా' అంటూ పాట పాడి అందర్నీ అలరించారు.

ఉన్నత శిఖరాలు చేరాలంటే.. నైపుణ్యాలను సాధించాలి

క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో వక్తలు

సమ్మిట్‌లో పాల్గొన్న వక్తలు

బేగంపేట్ మే 25 : ఉన్నత శిఖరాలు చేరాలంటే ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్యాలను సాధించాలని వక్తలు పేర్కొన్నారు. ఇందుకు అన్ని రకాల అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. జవహర్‌లాల్ అర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ టాస్క్ ఎంఎస్ ఎంఈ తదితర సంస్థల ఆధ్వర్యంలో శనివారం బేగంపేట్‌లోని మనోహర హోటల్‌లో క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్ – 2024 నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ.. కళల పట్ల అభిరుచి, సృజన తగిన అవకాశాలకు మార్గం చూపుతుందన్నారు. తరచుగా నిర్వహించే ఇలాంటి సదస్సులు విద్యార్థులు, నైపుణ్యం పెంచే సంస్థలకు మధ్య వారధిగా ఉంటాయన్నారు. అన్ని విద్యా సంస్థలను ఒకే చోట చేర్చడం ద్వారా విద్యార్థులకు అవసరమైన సమగ్ర సమాచారం అందుబాటులోఉంటుందని తెలిపారు. ఈ సదస్సులో గేమింగ్, ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్ మేకింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, ఫొటోగ్రఫీ తదితర రంగాలకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు ఆయా రంగాల ప్రతినిధులు అవసరమైన రంగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ శృతి ఓజా, టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ కమల్‌రాయ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు ప్రతిభ, రిషబ్ గుప్తా, సారథికృష్ణ, రమణ, భాస్కర్ రాజు, రాజశేఖర్, పీకే పోలిన, ప్రతిభ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో అధికారులదే ప్రత్యేక పాత్ర

పోలీసు అధికారులను ఉద్దేశించి జిల్లా జడ్జి వినోద్ కుమార్

8న జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, మే 25 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక పాత్ర పోషించాలని నాంపల్లి కోర్టులోని 2వ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జీ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. నాంపల్లి కోర్టులోని ప్రధాన సమావేశ మందిరంలో హైదరాబాద్ రెంజ్ డీసీపీలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్‌గా మాట్లాడుతూ.. రాజీ చేసుకునేందుకు కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు. ఇరువర్గాలకు చెందిన కక్షిదారులకు లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించాలన్నారు. రాజీ కుదిర్చేందుకు అధికారులు చేయూతనందించాలన్నారు. నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మనోరంజన్, సికింద్రాబాద్, నాంపల్లిలోని అన్ని కోర్టులకు చెందిన పోలీసు స్టేషన్ల వారీగా రాజీ చేసుకునేందుకు వీలున్న కేసులను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. చెక్ బౌన్స్, వివాహ సంబంధ, ఎక్సైజ్, రోడ్డు ప్రమాదాలు, కంపౌండబుల్ (రాజీకి వీలున్న) సెక్షన్ల కింద నమోదైన ఐపీసీ కేసులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరుగుతూ కష్టాలకు లోనుకాకుండా అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశాన్ని నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణ కుమారి సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాదు మహిళా రక్షణ విభాగం డీసీపీ సీసీఎస్, డీడీ డి.కవిత, డీసీపీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

టైమ్స్ ఇండియా వెస్ట్ ఎక్స్ పో షురూ..

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల టైమ్స్ వెస్ట్ హైదరాబాద్ ఎక్స్‌పో శనివారం ప్రారంభమైంది. నీటి పారుదల, విద్య ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి టైమ్స్ ఆఫ్ ఇండియా ఉమ్మడి రాష్ట్రాల రెస్పాన్స్ హెడ్ కమల్ కృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

– మియాపూర్, మే 25

31న మెగా జాబ్ మేళా

గుజరాతీ స్కూల్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రెండు వేలకు పైగా ఉద్యోగాల భర్తీ

హాజరుకానున్న 20కి పైగా కంపెనీలు

టెన్త్, ఆపై అర్హత ఉన్నవారికి ఉద్యోగావకాశం

కంటోన్మెంట్, మే 25 : సికింద్రాబాద్ బోయిగూడలోని గుజరాతీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 31వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శులు గద్దె భాస్కర్, సందీప్ హరి శనివారం పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌ల్యాండ్, రాంకీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ డ్రైవ్‌లో పదుల సంఖ్యలో పలు రకాల సంస్థలు పాల్గొంటాయన్నారు. రెండు వేలకు పైగా పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ డ్రైవ్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్, యూజీ, గ్రాడ్యుయేట్, పీజీస్, బీఈ, బీటెక్ విద్యార్హత కలిగినవారు అర్హులన్నారు. ఈ డ్రైవ్‌లో నూతనంగా ఉద్యోగం పొందేవారు, నైపుణ్యం కలిగినవారు కూడా హాజరు కావొచ్చన్నారు.

20కిపైగా కంపెనీలు.. రెండువేలకు పైగా ఉద్యోగాలు

గుజరాతీ హైస్కూల్‌లో నిర్వహించే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 20కి పైగా కంపెనీలు, 2వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. వచ్చే శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ లింక్ https://forms.gle/ ZC83VxC9uNc9AqBT9లో తమ పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు.

హెచ్ఎండీఏకు అమరుల స్మారక కేంద్రం అప్పగింత

సంయుక్తంగా ఆర్ అండ్ బీ, హెచ్ఎండీఏ అధికారుల పరిశీలన

సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలను అర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్మారక కేంద్రాన్ని ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ హెచ్ఎండీఏకు ప్రత్యేకంగా లేఖ రాసింది. హుస్సేన్‌సాగర్ సమీపంలో రాష్ట్ర సచివాలయం ఎదురుగా జలదృశ్యం ఉన్న స్థలంలో సుమారు రూ.177 కోట్లతో తెలంగాణ అమరవీరుల స్మారక కేంద్రాన్ని అత్యాధునిక నిర్మాణ శైలిలో నిర్మించింది. నిర్మాణ పనులన్నీ కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే పూర్తయి ప్రారంభోత్సవం చేసుకున్న అమరవీరుల స్మారకం కేంద్రాన్ని హెచ్ఎండీఏకు అప్పగించడం ద్వారా పర్యాటకులకు మరింత అందుబాటులో ఉండేలా చేయనున్నారు. సంయుక్తంగా ప్రాజెక్టు నిర్మాణాన్ని, పెండింగ్‌లో ఉన్న పనులను, నిర్వహణ అంశాలపై ఇంజినీరింగ్ అధికారుల బృందం పరిశీలించిన తర్వాత అప్పగింతలకు సంబంధించిన తుది నిర్ణయం జరుగుతుందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే హుస్సేన్‌సాగర్ చుట్టూ అన్ని రకాల పర్యాటక కేంద్రాలు, పార్కుల నిర్వహణను హెచ్ఎండీఏ పరిధిలోని బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ చూస్తున్నది. లుంబినీ పార్కును ఆనుకొనే అమరవీరుల స్మారక కేంద్రం ఉండటంతో నిర్వహణతో పాటు పర్యాటక కేంద్రంగా నిత్యం వేలాది మందికి అందుబాటులో ఉంచేందుకు హెచ్ఎండీఏ చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

టీ వర్క్స్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్‌పై వర్క్‌షాప్

సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వాహనాల రూపకల్పన, ఇంజినీరింగ్ పరిజ్ఞానంపై టీ వర్క్స్‌లో ప్రత్యేకంగా రెండు వారాల పాటు వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దేశంలోనే అతి పెద్ద హార్డ్‌వేర్ ఉత్పత్తుల నమూనాల తయారీ కేంద్రమైన టీ వర్క్స్‌లో కొత్త ఆవిష్కరణలు చేయాలన్న ఆసక్తిగల వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో టీ వర్క్స్‌లో ఔత్సాహికులకు నిపుణులతో శిక్షణ కార్యక్రమాన్ని ఇస్తున్నామని తెలిపారు. విద్యుత్ వాహనాల తయారీకి సంబంధించిన పరిజ్ఞానం తెలుసుకోవాలనే వారు టీ వర్క్స్‌ను లేదా (https://growezy.club/tworks/events/fhIIVrY)లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. జూన్ 10 నుంచి 22 వరకు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పది, 12లలో సత్తా చాటిన గోల్కొండ ఆర్మీ స్కూల్

సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ) : గోల్కొండ ఆర్మీ పబ్లిక్ స్కూల్ సీబీఎస్ఈ గ్రేడ్ 10, 12లలో సత్తా చాటింది. వంద శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ అనిత కరుణాకరణ్ శనివారం పేర్కొన్నారు. గ్రేడ్ 12లో 97 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిష్ఠ మిశ్రా, ప్రణవ్ సింగ్ సెకెండ్ టాపర్‌గా నిలిచినట్టు తెలిపారు. అనంతరం, హ్యూమానిటీస్‌లో దేవ్ మిశ్రా 96.8 శాతంతో, అద్వైత్ బాలచందర్ సైన్స్‌లో 95.8 శాతం, కామర్స్‌లో 95.6 శాతంతో వైష్ణవి ఆర్వీలు టాపర్లుగా నిలిచారని ప్రశంసించారు. అంకితభావంతోనే తమ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆమె అన్నారు.

ఐఐసీటీ సందర్శన

సిటీబ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ) : సుస్థిర, పర్యావరణహితమైన పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ, ఇంధన వనరుల ఉత్పత్తియే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాన్ని ఆవిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పర్యటించిన సందర్భంగా రీసెర్చ్‌లో అమలు చేస్తున్న వ్యర్థాల నిర్వహణ, ఇంధన వనరుల ఉత్పత్తి వంటి వినూత్న ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఐసీటీ సైంటిస్టులతో కలిసి ప్రత్యేక సమావేశమై గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఎదురౌతున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనే క్రమంలో టెక్నాలజీ పాత్రపై చర్చించారు. గతంలో ఐఐసీటీ డెవలప్ చేసిన బయో ప్లాంట్లతో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా.. అదే తరహాలో గేటెడ్ కమ్యూనిటీలో ఉత్పత్తి అయిన చెత్త నుంచి బయోగ్యాస్ ప్లాంట్‌తో జీహెచ్ఎంసీ పర